క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా రాజబొల్లారం సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రాజబొల్లారం పరిధిలోని పరిశ్రమలకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు ఆమె కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్‌తో కలిసి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. 18వ వార్డును సమస్యలు లేని వార్డుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ విజయలక్ష్మీ, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామని స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఎల్ఎన్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కాలనీల్లో వీధి దీపాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

గృహలక్ష్మీ పథకం కోసం దరఖాస్తు చేసుకోండి



తహసీల్దార్ కృష్ణ

ఘట్‌కేసర్: అర్హులైన పేదలు గృహలక్ష్మీ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఘట్‌కేసర్ తహసీల్దార్ కృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇంటి స్థలం దస్తావేజులు, బ్యాంకు పాస్‌బుక్, వికలాంగులైతే సదరం సర్టిఫికెట్లను జతచేసి ఈ నెల 10వ తేదీలోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు దరఖాస్తు చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు కలెక్టర్ అనుమతితో జిల్లాలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ)లో భాగంగా 35శాతం రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాల మంజూరు కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి పడాల రవీందర్ తెలిపారు. జిల్లాలోని రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, స్వయం సహాయ సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సూక్ష్మ ఆహార పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ యువతతోపాటు ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలు, సందేహాలకు, జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ డీఆర్‌పీ అమర్‌సింగ్ ఫోన్ నంబర్: 9493438347.

ఎంపీడీఓ, ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉపాధి హామీ పథకం కూలీలకు పని కల్పించడంలో విఫలమైనందుకుగాను ఘట్‌కేసర్ ఎంపీడీఓతోసహా కొర్రెముల, చౌదరిగూడ గ్రామ కార్యదర్శులకు షోకాజ్‌లను జారీ చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి తెలిపారు. సామాజిక తనిఖీ బృందం ఘట్‌కేసర్ మండలంలో 2021–23 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ నిర్వహించగా, కూలీలకు పని కల్పించడంలో విఫలమైనట్లు వెల్లడైందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ ఎంపీడీఓతో సహా ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ అందజేశామన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోండి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కార్యాలయం ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గురువారం ఉ.10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్, టెక్నికల్, ఫైనాన్స్, కన్జూమర్ ఎఫైర్స్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలతో పాటు బిల్లుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

దేవుడి భూమికే ఎసరు

- ఆలయం పక్కన స్థలంలో రాత్రికి రాత్రే వెలిసిన సీసీ రోడ్డు
- ఆలయ అభివృద్ధి పేరుతో రియల్ వెంచర్‌కు రోడ్డు
- అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



ఆలయం పక్క స్థలంలో రాత్రికి రాత్రే వెలిసిన సీసీ రోడ్డు

మేడ్చల్: కబ్జాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లిలో ఆలయం భూమి, చెరువు శిఖం భూమిని కబ్జా చేసి ఓ రియల్ వ్యాపారి రాత్రికి రాత్రే రోడ్డు వేయించాడు. అత్వెల్లి పరిధిలో పెద్ద చెరువుపై పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆలయం వెనుక శిఖం భూమి ఉండగా, గుడి పక్కన ఆలయ భూమి ఉంది. ఆలయం వెనుక వైపు గ్రామానికి చెందిన కొంతమంది భూములు ఉండగా వారు గతంలో ఓ రియల్టర్‌కు విక్రయించారు. ఆయన వెంచర్ చేసే క్రమంలో ఏకంగా తన వెంచర్‌కు రోడ్డు కలిసే విధంగా సీసీ రోడ్డు వేశారు.

కోట్ల రూపాయాల భూమి..

అత్వెల్లిలోని భూములు కోట్ల రూపాయాల విలువ చేస్తున్నాయి. ఈ విలువైన భూమిలో ఓ ప్రైవేటు వ్యక్తి దర్జాగా రోడ్డు వేసినా ఎవ్వరూ కిమ్మనడం లేదు. దాదాపు 500 ఏళ్ల కిత్రం నాటి వేంకటేశ్వర స్వామి ఆలయం కావడంతో ఆలయాన్ని కమిటీ వారు ఇటీవల కూల్చేసి దాతల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కనే ఇటీవల శివాలయాన్ని నిర్మించారు. శివాలయం స్థలం పోనూ ఖాళీ స్థలం చాలా ఉంది. ఆ స్థలం ఆలయ భూమిగా ఉండగా ఆలయం వెనుక పెద్ద చెరువు భూమి ఉంది. ఆలయం అభివృద్ధి పేరుతో ఆలయం వెనుక భూములు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారి తన భూమికి రోడ్డు కోసం కొంతమంది గ్రామస్తులను తన వలలో వేసుకుని దర్జాగా దాదాపు 700 గజాల స్థలాన్ని కబ్జా చేసి సోమవారం రాత్రికి రాత్రే పటిష్టంగా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేశాడు. ఆలయం భూమి, చెరువు శిఖం భూమిని కబ్జా చేసి వెంచర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాడు.



నాకేం తెలియదు: రియల్టర్

నాకేమీ తెలియదని అంతా ఆలయ కమిటీ వారికే తెలుసని సదరు రియల్టర్ తారక్ సాక్షికి తెలిపాడు. తాను ఎలాంటి స్థలం కబ్జా చేయలేదని, ఎలాంటి రోడ్డు వేయలేదని, అంతా ఆలయ ధర్మకర్త సుదర్శనచారికి తెలుసని ఆయన తెలిపారు.

గుడికి అవసరమనే రోడ్డు నిర్మించారు: ధర్మకర్త

ఆలయానికి వెనుక నుంచి వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేశారని, సదరు రియల్టర్ ఆలయ నిర్మాణం కోసం రూ.50 లక్షలు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చిన తర్వాతే రోడ్డు వేసేందుకు అనుమతి ఇచ్చామని అన్నారు. రోడ్డు నిర్మాణంతో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కలుగుతాయని రోడ్డు విషయంలో ముందుకు వెళ్లాం.

కోట్ల విలువ చేసే భూమిని ధారాదత్తం చేశారు: గ్రామస్తులు

రోడ్డు నిర్మాణం పేరుతో పెద్ద మనుషుల ముసుగులో కొంతమంది రాజకీయ నాయకులు, బడాబాబులు ఆలయం, చెరువు శిఖం భూమిని ధారాదత్తం చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆలయం అభివృద్ధికి విరాళాలు ఇస్తే విలువైన భూమిని ఓ రియల్టర్‌కు ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. తమ స్వార్థం కోసం నాయకులు అందరికీ పనికి వచ్చే ఆలయం భూమిని అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తుల కోసం మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలంలో రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారని నిలదీస్తున్నారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యాదగిరి ఈ విషయాన్ని గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లగా కో ఆప్షన్ సభ్యుడు రఫీ, బీజేపీ నాయకులు ప్రేందాస్, ఈశ్వర్ తదితరులు రోడ్డు విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

విచారణ చేస్తాం: తహసీల్దార్ శైలజ

అత్వెల్లి ఆలయం పక్కన రోడ్డు వేసిన విషయం మా దృష్టికి ఫిర్యాదు ద్వారా వచ్చింది. రోడ్డు వేసిన స్థలం ఆలయ భూమేనా, చెరువు శిఖం భూమా? పూర్తిస్థాయి విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. భూమి అన్యాక్రాంతం చేసిన వారిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు చేపడతాం.

సమస్యలను గుర్తిస్తాం..

అప్పటికప్పుడు పరిష్కరిస్తాం

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: గ్రామాల్లో పాదయాత్రలతో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు సొంత నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కీసర, భోగారం, కీసరదాయర, వన్నిగూడ, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో మంత్రి మల్లారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న దేవాలయాల నిర్మాణాలు పూర్తిచేయడంతో పాటు అవసరమైన కాలనీల్లో సీసీరోడ్లు వేయిస్తున్నట్లు తెలిపారు. కీసరదాయర, కీసరలోని ముస్లింల శ్మశానవాటికల అభివృద్ధి, ఈద్గాల వద్ద ప్రహరీ గోడల నిర్మాణాలు సొంత నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. పాదయాత్ర చేపట్టిన గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు సంబంధించిన పనులను బుధవారం నుంచే ప్రారంభించనున్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. మల్లారెడ్డి హెల్త్ యూనివర్సిటీ చైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు డాక్టర్ చామకూర భద్రారెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచులు నాయకపు మాధురివెంకటేష్, మోర విమల, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తటాకం నారాయణ, పండుగ కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచులు, వార్డుసభ్యులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



కీసరలోని వన్నిగూడ అంగన్‌వాడీ భవనం వద్ద మంత్రి మల్లారెడ్డి తదితరులు

రూ.2.95 కోట్లతో అభివృద్ధి పనులు



నాగారం మున్సిపల్ పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సుమారు రూ.2.95 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో అవసరమైన చోట కౌన్సిలర్ల సూచన మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీరోడ్లు వేసేందుకు రూ.2.95 కోట్ల మున్సిపల్ నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మానించామన్నారు. అదేవిధంగా రూ.23 లక్షల మున్సిపల్ నిధులు వెచ్చించి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, నూనెలు, చెప్పులు కొనుగోలు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల కోసం ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ సమానంగా నిధులు కేటాయిస్తామన్నారు. ఇందు కోసం కౌన్సిలర్లు సహకరించాలన్నారు. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు నిద్రలో.. దొంగలు ఇంట్లో..

కీసర: ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.3.5 లక్షల విలువచేసే 7 తులాల బంగారు ఆభరణాలతో పాటు 18 తులాల వెండి ఆభరణాలు, రూ.1600 నగదు ఎత్తుకెళ్లిన ఘటన చీర్యాల గ్రామంలోని ఎస్ఎల్ఎస్‌కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం చీర్యాల గ్రామం ఎస్ఎల్ఎస్ కాలనీలో నివాసం ఉంటున్న రాజేందర్ కుటుంబంతో కలిసి సోమవారం ఉదయం వేములవాడ వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి నిద్రించారు. అర్ధరాత్రి రాజేందర్ దంపతులపై మత్తుమందు చల్లి 7 తులాల బంగారు ఆభరణాలు, 18 తులాల వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం 100 నంబర్‌కు ఫోన్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అతడి ఇంట్లో గతంలోనూ చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు.

అంకితభావంతో పనిచేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు



వాణీరెడ్డిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతారని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మూడున్నర ఏళ్లు నాగారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి ఇటీవల స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా మీర్‌పేట కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లిన నాగారం మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డికి వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి మున్సిపల్ శాఖ నుంచి పలు అవార్డులు సాధించడంలో కమిషనర్ వాణీరెడ్డి పాత్ర మరువలేమన్నారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులందరినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించారన్నారు. ఆమె మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని అభిలాషించారు. వాణీరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంలో నాగారం మున్సిపాలిటీని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. అంతకుముందు నాగారం మున్సిపాల్ పాలకవర్గం ఆధ్వర్యంలో వాణీరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నాగారం మున్సిపల్ కొత్త కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, గూడురు సబితాఆంజనేయులుగౌడ్, కౌకుట్ల మమత, కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, దివ్యదయాకర్‌రావు, సుర్వీ శ్రీనివాస్, కొమురెల్లి అనితా, మోకు రేణుక, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, నాగేష్‌గౌడ్, సరితారమేష్, ప్రియాంక, అన్నంరాజు లావణ్య, లక్ష్మీ వేణుగోపాల్, సుమిత్రసురేష్, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు గూడురు అంజన్న, మోకు జగన్ మోహన్‌రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, కొమురెల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం

– మేయర్ కావ్య



జవహర్‌నగర్: హరితహారంలో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ శాంతినగర్‌లో మంగళవారం మేయర్ కావ్య మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హరితహారంతో జవహర్‌నగర్ పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం సుమారు 1800 మొక్కలను కాలనీవాసులకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం, వార్డు కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌లు అందజేసిన కౌన్సిలర్ మణికంఠగౌడ్



మేడ్చల్: సొంత ఖర్చులతో 350 మంది విద్యార్థులకు కౌన్సిలర్ మణికంఠగౌడ్ బస్‌పాస్‌లను అందజేశారు. ఆర్టీసీ అందజేస్తున్న సంవత్సరం పాస్‌ల డబ్బులను ఆయన చెల్లించి అందజేశారు. పట్టణంలోని జిల్లా బాలికల పాఠశాల విద్యార్థులకు ఆయన పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో డిపో డిప్యూటీ మేనేజర్ రామారావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, నాయకులు శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

యాదవ సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో యాదవ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని గ్రామానికి చెందిన యాదవులు సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డికి స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో యాదవ కమ్యూనిటీ భవనం కోసం స్థలం కేటాయించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో మశ్చేందర్ రెడ్డి, ఐలయ్య, భానుయాదవ్, సురేశ్‌యాదవ్, కృష్ణయాదవ్, వీరేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, కొండల్‌యాదవ్, విష్ణుయాదవ్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతాం..



మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ గణేష్

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటికీ మొక్కలను నాటాలని కౌన్సిలర్ తుడుం గణేష్ మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. వార్డులో ప్రతి ఇంటి ముందు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతామని, అందరూ సహకరించాలని కోరారు. హరితహారంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు.

ప్రతాపసింగారంలో ఇంటింటికీ కాంగ్రెస్



ఘట్‌కేసర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ప్రతాపసింగారంలో ఆ గ్రామ శాఖ అధ్యక్షుడి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ కుమార్ హాజరై ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి వివరించారు. యూత్ కాంగ్రెస్ ప్రతాపసింగారం అధ్యక్షుడు భానుప్రకాశ్, మండల కార్యదర్శి రాజేష్, మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సంబంధాలను మెరుగు పర్చుకోవాలి

ఘట్‌కేసర్: విద్యార్థులు సంబంధాలను మెరుగు పర్చుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ స్ట్రాటజీ అండ్ డిజిటల్ లెర్నింగ్ డైరెక్టర్ అనురాగ్ పల్లా అన్నారు. మంగళవారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత నైపుణ్యం అభివృద్ధి చేసుకునేందుకు ఇండక్షన్ ప్రోగ్రామ్ తోడ్పడుతుందని, సహ పాఠ్య కార్యకలాపాల కోసం యూనివర్సిటీలో అనేక క్లబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏయూ రిజిస్ట్రార్ బాలాజీ, డీన్ ముత్తారెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ప్రొఫెసర్ సుధీర్‌రెడ్డి, బీబీఏ సలహాదారు పీఎస్ఎస్ మూర్తి, డీన్ విష్ణువందన, విద్యార్థులు పాల్గొన్నారు.



అనురాగ్ యూనివర్సిటీలో బీబీఏ విద్యార్థుల ఓరియెంటేషన్ ప్రోగ్రామ్

ఒకేషనల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలల్లో అదనంగా చేర్చిన 6 ఒకేషనల్ పోస్టులకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈఓ కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 9 వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఐఈఓ కార్యాలయంలో టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్‌ను జతపరిచి దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం



దివ్యాంగుడిని సన్మానిస్తున్న కార్పొరేటర్ నిహారికగౌడ్, కిరణ్‌కుమార్

జవహర్‌నగర్: పేదరిక నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయమని 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ అన్నారు. దివ్యాంగుల హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో శ్రీహర్షిణి ఫౌండేషన్ సహకారంతో మంగళవారం జవహర్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడికి ఏర్పాటు చేసిన పాన్‌షాప్, కిరాణషాపును కార్పొరేటర్ నిహారికగౌడ్, దివ్యాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. నాయకులు సంపత్‌కుమార్, శ్రీనివాస్, సాంబయ్య, అప్పారావు, సుగుణ, మహేష్, బబ్లూ, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

భోగారం చౌరస్తాలో ధర్నా

కీసర: బర్సిగూడ గ్రామానికి రెవెన్యూ నక్షతో పాటు రైతుపాసు బుక్కులు అందజేయాలని మంత్రి మల్లారెడ్డిని అడిగినందుకు ఆయన రైతులను క్షించపరిచే విధంగా మాట్లాడంతోపాటు బెదిరింపులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని, బీజేపీ రాష్ట్ర నేత భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సుంకర జైహిందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మంత్రి మల్లారెడ్డి పాదయాత్రలో భాగంగా భోగారంలో పర్యటిస్తుండగా బర్సిగూడ గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ గ్రామానికి నక్షతో పాటు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదేవిషయమై మంత్రి మల్లారెడ్డి రైతులను బెదిరించేలా మాట్లాడారని బీజేపీ, కాంగ్రెస్ నేతలు గ్రామ చౌరస్తాలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు, బర్సిగూడ గ్రామ రైతులు పాల్గొన్నారు.



భోగారం చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు, బర్సిగూడ గ్రామ రైతులు